ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5 పార్వతీపురం మన్యం
జిల్లా వార్తలు
శనివారం 23 ఆగస్టు 2025



ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ప్రతిపాదనలు

బెలగాం, ఆగస్టు22(ఆంధ్రజ్యోతి): జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డులకు ప్రతిపాదనలు కోరుతున్నట్లు డీఈవో బి.రాజ్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు దరఖాస్తులు చేసుకోవచ్చని తెలిపారు. పది సంవత్సరాల నుంచి ఉపాధ్యాయ సేవలు అందిస్తున్న వారు, ఇతర అర్హతలు ఉన్నవారు ఈనెల 26లోపు ప్రతిపాదనలు పంపాలని పేర్కొన్నారు. వాటిని పరిశీలించి పలువురిని ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక చేస్తామన్నారు. వారికి వచ్చే నెల 5న టీచర్స్‌డే నాడు అవార్డులు అందిస్తామని వెల్లడించారు.

● బడిదేవర కొండపై యథేచ్ఛగా తవ్వకాలు
● కోట్లాది రూపాయల గ్రానైట్ తరలింపు
● గత వైసీపీ సర్కారు హయాంలో ఆదేశాలు
● ఆ ప్రాంతం రిజర్వ్ ఫారెస్ట్‌లో ఉందంటున్న అటవీ శాఖ
● అయినా చర్యలు శూన్యం..
● ఆందోళనలో గిరిజనులు

ప్రభుత్వం మారినా..

అడ్డుకట్ట పడలే!



గ్రానైట్ తవ్వకాలతో రూపు కోల్పోయిన బడిదేవరకొండ



పార్వతీపురం, ఆగస్టు22 (ఆంధ్రజ్యోతి): గత టీడీపీ ప్రభుత్వ కాలంలో అది రిజర్వ్ ఫారెస్ట్ ప్రాంతం. వైసీపీ సర్కారు పాలనలో రెవెన్యూ ప్రాంతంగా మారింది. అయితే ఎన్నికల ఫలితాల తర్వాత కూడా నాటి కోర్టు ఆదేశాలు చూపుతూ పార్వతీపురం మండలం బడిదేవరకొండ వద్ద గ్రానైట్ తవ్వకాలు చేపడుతున్నారు. కోట్లాది రూపాయల గ్రానైట్‌ను యథేచ్ఛగా తరలిస్తున్నారు. వాస్తవంగా గత వైసీపీ సర్కారు పాలనలో సర్వే నివేదికలు మారిపోగా... దీని వెనుక ఆ పార్టీ పెద్దల హస్తం ఉందనే ఆరోపణలున్నాయి. గ్రానైట్ తవ్వకాలకు అనుమతులు ఇచ్చిన ప్రాంతం రిజర్వ్ ఫారెస్ట్‌లో పరిధిలో ఉందని 2017లో హైకోర్టుకు ఆధారాలతో తెలియజేసిన అటవీశాఖ.. వైసీపీ ప్రభుత్వ కాలంలో పూర్తిగా కళ్లుమూసుకుందనే విమర్శలున్నాయి. ఏదేమైనా రిజర్వ్ ఫారెస్ట్‌గా గుర్తించిన ఈ ప్రాంతం రెవెన్యూ శాఖకు ఎలా చెందుతుందో, ఏ విధంగా గనులశాఖ అనుమతులు మంజూరు చేసిందో? తెలియని పరిస్థితి ఏర్పడింది. దీనిపై కూటమి ప్రభుత్వం దృష్టిసారించాలని ఆ ప్రాంత వాసులు డిమాండ్ చేస్తున్నారు.

ఇదీ పరిస్థితి...

● పార్వతీపురం మండం పోరి రెవెన్యూ పరిధి సర్వే నెంబర్-1లో, మొలగ రెవెన్యూ పరిధిలోనూ గ్రానైట్ కొండలు ఉన్నాయి. వాటిపై కొంతమంది గ్రానైట్ వ్యాపారులు కన్నేశారు. ఈ మేరకు సర్వే నెంబర్-1లో 18.5 హెక్టార్లలో కలర్ గ్రానైట్ తవ్వకాలు చేపట్టేందుకు గాను రెవెన్యూశాఖ నివేదికలతో గనులశాఖ కాంట్రాక్టర్లకు అనుమతులు మంజూరు చేసింది.

● దీనిపై అటవీశాఖ అభ్యంతరం తెలిపింది. తవ్వకాలకు అనుమతులిచ్చిన ప్రాంతం రిజర్వ్ ఫారెస్ట్ పరిధిలో ఉందని ఆధారాలతో సహా నిరూపించింది. ఈ విషయం తెలుసుకున్న స్థానికులు ప్రైవేట్ పిటీషన్ దాఖలు చేయడంతో హైకోర్టు స్పందించింది. గ్రానైట్ తవ్వకాలకు అనుమతులు ఇచ్చిన ప్రాంతం ఏ పరిధిలో ఉంది? సర్వే చేసి నివేదికను అందించాలని అప్పట్లో గనులు, రెవెన్యూ, అటవీశాఖ రాష్ట్ర ఉన్నతాధికారులను ఆదేశించింది.

ఎన్నికల ఫలితాల తర్వాత..

ఎన్నికల ఫలితాల తర్వాత బడిదేవరకొండపై గ్రానైట్ తవ్వకాలు పునః ప్రారంభించారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో హైకోర్టు ఇచ్చిన ఆదేశాలు చూపి యథేచ్ఛగా తమ దందా కొనసాగిస్తున్నారు. దీనిపై ప్రస్తుత ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించకపోవడంపై ఆ ప్రాంతవాసులు పెదవి విరుస్తున్నారు. తక్షణమే కూటమి ప్రభుత్వం స్పందించి తవ్వకాల అనుమతులు రద్దు చేయాలని గిరిజనులు డిమాండ్ చేస్తున్నారు.

వైసీపీ హయాంలో...

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో.. బడిదేవరకొండ ప్రాంతంలో సర్వే ఆఫ్ ఇండియా మొక్కుబడిగా సర్వే నిర్వహించి హైకోర్టుకు తప్పుడు నివేదికలు ఇచ్చిందన్న ఆరోపణలున్నాయి. కాగా ఈ నివేదిక ప్రకారం ఆ ప్రాంతం రిజర్వ్ ఫారెస్ట్ పరిధిలో లేదని హైకోర్టు స్పష్టం చేసింది. అయితే జిల్లా అటవీ, రెవెన్యూ శాఖల అధికారులు అంగీకారం తెలిపిన తర్వాతే గ్రానైట్ తవ్వకాలకు అను మతులు ఇవ్వాలని న్యాయ స్థానం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. దీంతో గ్రానైట్ వ్యాపారులు రంగం లోకి దిగి.. ఈ ప్రాంతం రెవెన్యూ పరిధిలో ఉంటుందని సర్టి ఫికెట్ పొందారు. అటవీ శాఖను సంప్రదిం చకుండా గనులశాఖకు రెవెన్యూ శాఖ ఇచ్చిన ధ్రువీకరణ పత్రాన్ని అందించి ఆగమేఘాలపై గ్రానైట్ తవ్వకాలకు అనుమతులు పొందారు.

● ఆ మూడు శాఖల ఉన్నతాధికారులు ఈ ప్రాంతాన్ని పరిశీలించి కోర్టుకు నివేదిక అందించారు. గ్రానైట్ తవ్వకాలకు అనుమతులు ఇచ్చిన ప్రాంతం రిజర్వ్ ఫారెస్ట్‌లో ఉన్నట్టు తేల్చారు. దీంతో అప్పట్లో హైకోర్టు గనులశాఖ ఇచ్చిన అనుమతులను రద్దు చేసింది. బడిదేవరకొండ వద్ద గ్రానైట్ తవ్వకాలు నిలిచిపోవడంతో ఆ ప్రాంతంలో గిరిజనులు ఆనందం వ్యక్తం చేశారు. తాము కొలుస్తున్న ఆరాధ్యదేవత కొండను అటవీశాఖాధికారులు

(మిగతా 8వ పేజీలో...)

మృతుల పేరిట మస్తర్లు

● అభివృద్ధి పనుల్లో తేడాలు.. అనర్హులకు పింఛన్లు
● సామాజిక తనిఖీలో బయటపడిన ఉపాధి లోపాలు
● నిధుల దుర్వినియోగమైనట్లు గుర్తింపు ● డ్వామా పీడీ ఆగ్రహం



సామాజిక తనిఖీలో నివేదికలను చదువుతున్న ఎస్ఆర్‌పీ, డీఆర్‌పీలు

గరుగుబిల్లి, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): మృతుల పేరిట మస్తర్లు వేసి క్షేత్ర సహాయకులు చేతివాటం చూపించడంపై డ్వామా పీడీ కె.రామచంద్రరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం గరుగుబిల్లిలో సామాజిక తనిఖీ ప్రజా వేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీలవారీగా నివేదికలను బహిర్గతం చేయగా బోగస్ మస్తర్ల అంశం చర్చనీయాంశమైంది. ప్రధానంగా పంచాయతీల పరిధిలో చేపట్టిన పలు అభివృద్ధి పనుల్లో తేడాలున్నట్లు , తక్కువ పని చేసినా అధికంగా కొలతలు వేసి నిధులు దుర్వినియోగానికి పాల్పడినట్లు గుర్తించారు. పనులు నిర్వహించే ప్రాంతాల్లో సమాచార బోర్డులు ఏర్పాటు చేయకుండా సంబంధిత క్షేత్ర సహాయకుల ఖాతాల్లోకి నిధులు జమైనట్లు వెల్లడించారు. ఫాంపాండ్స్‌తో పాటు పలు పనుల్లో కొలతల తేడాలను గుర్తించారు. ఎంబుక్‌లతో పాటు మస్తర్లలో దిద్దుబాట్లు బయటపడ్డాయి. తోటపల్లిలో సోప్‌పిట్‌కు బదులు మరుగు దొడ్ల నిర్మాణం చేపట్టినట్లు తేల్చారు. కొత్తూరు పంచాయతీకి సంబంధించి ఫుడ్ గార్డెన్‌కు రూ.97 వేలు చెల్లించకుండా సంబంధిత ఉపాధి హామీ ఏపీవో క్షేత్ర సహాయకులకు బదిలీ చేశారు. అయితే అందులో సగం రూ. 48,760 పంచాయతీరాజ్ విభాగంలో వర్క్ ఇన్స్పెక్టర్‌గా పనిచేస్తున్న వారికి ఉపాధి ఏపీవో ఫోన్ పే చేయించారు. కొత్తూరులో మినీ గోకులం నిర్మించకుండా ఇసుక కొనుగోలు కోసం క్షేత్ర సహాయకునికి రూ. 20 వేలును బదిలీ చేయించారు. రావివలసలో వేతనదారులు పనులకు హాజరుకాక పోయినా, పలు పనులకు సంబంధించి ఎంబుక్ రికార్డు చేయకపోయినా చెల్లింపులు చేశారని తనిఖీ బృందం వివరించింది. రావివలస, చిలకాంలో అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు పింఛన్లు పొందుతున్నట్లు పరిశీలనలో తేలింది. గ్రామాల్లో డప్పు, చర్మకారులు, కళాకారులకు గుర్తింపు కార్డులు లేనట్లు గుర్తించారు.

మేట్లు తొలగింపునకు ఆదేశాలు

పంచాయతీల పరిధిలో బోగస్ మస్తర్లు, దిద్దుబాట్లు, పనులకు వెళ్లకుండా వేతనాలు పొందేలా సహకరించిన నాగూరు, రావివలస, శివ్వాంతో పాటు పలు పంచాయతీల్లో మేట్లును తొలగించాలని పీడీ ఆదేశించారు. ఉపాధి టెక్నికల్ అసిస్టెంట్లును సస్పెండ్ చేయగా, పలువురు క్షేత్ర సహాయకులకు షోకాజు నోటీసులు జారీ చేయాలన్నారు. మరికొందరు క్షేత్ర, టెక్నికల్ అసిస్టెంట్లకు అపరాధ రుసుం విధించారు.

వైభవంగా శ్రావణ శుక్రవారం పూజలు



పాలకొండ కోటదుర్గమ్మ ఆలయంలో కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు

6లో

ఎరువుల బ్లాక్ మార్కెట్‌పై నిఘా

పార్వతీపురం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ఎరువుల బ్లాక్ మార్కెట్‌పై నిఘా పెట్టామని ప్రాంతీయ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి బర్ల ప్రసాదరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం డైరెక్టర్ జనరల్ హరీశ్‌కుమార్‌గుప్తా ఆదేశాల మేరకు ప్రస్తుతం ఎరువుల షాపులపై దాడులు నిర్వహిస్తున్నామన్నారు. యూరియా, ఎరువుల కృత్రిమ కొరత, బాక్ మార్కెటింగ్ నివారించేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని తెలిపారు.

మూడో విడతలో పంపిణీ

● వచ్చేనెల 6న జిల్లాకు స్మార్ట్ రైస్ కార్డులు



పార్వతీపురం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): స్మార్ట్ రైస్ కార్డుల పంపిణీపై శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వం కీలక ప్రకటన చేసింది. ఈనెల 25 నుంచి పండుగ వాతావరణంలో కార్డుల పంపిణీ ప్రారంభించనున్నట్లు స్పష్టం చేసింది. మొత్తంగా నాలుగు విడతల్లో జిల్లాల వారీగా ఈ కార్యక్రమం చేపట్టనున్నారు. జిల్లాలో మాత్రం మూడో విడతలో స్మార్ట్ రైస్ కార్డులు అందించనున్నట్లు తెలిసింది. కాగా వచ్చేనెల 6న మన్యానికి ఆ కార్డులు రానున్నట్టు సమాచారం. ఇంటింటికీ వెళ్లి కార్డుదారులకు వాటిని అందించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. పాత వారితో పాటు కొత్త వారికి కూడా స్మార్ట్ రైస్ కార్డులను అందించనున్నారు. కాగా వాటిని పొందిన వారు రాష్ట్రంలో ఏ డిపో నుంచైనా రేషన్ తీసుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పిస్తోంది. ఉపాధి కోసం దూర ప్రాంతాల్లో ఉండేవారు, వలస బాట పట్టిన వారు రేషన్ కోసం ప్రత్యేకంగా తమ సొంత గ్రామాలకు రావాల్సిన అవసరం లేదు. వారు రాష్ట్రంలో ఉండే ఏ డిపోలో అయినా బియ్యంతో పాటు పంచదార తదితర నిత్యావసర సరుకులను పొందొచ్చు.

విధుల్లో ఐటీడీఏ ఇన్‌చార్జి పీవోలు



బాధ్యతలు స్వీకరించిన ఇన్‌చార్జి పీవోలు వైశాలి, పవార్ స్వప్నిల్ జగన్నాథ్

పార్వతీపురం/సీతంపేట రూరల్, ఆగస్టు22 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురం, పాలకొండ సబ్ కలెక్టర్లు వైశాలి, పవార్ స్వప్నిల్ జగన్నాథ్‌లు ఐటీడీఏల ఇన్‌చార్జి పీవోలుగా బాధ్యతలు స్వీకరిం చారు. కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ ఆదేశాల మేరకు వారు శుక్రవారం పార్వతీపురం, సీతంపేట ఐటీడీఏ కార్యాలయాలకు చేరుకున్నారు. పార్వతీపురం ఐటీ డీఏ ఇన్‌చార్జి పీవో వైశాలి తొలుత ఏపీవో మురళీ ధర్, ఏఈవో ప్రసాద్ తదితర శాఖల అధికారులతో సమీక్షించారు. గిరిజనుల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని, అలసత్వం వహించొద్దని తెలిపారు. ఆదివాసీలకు నిర్దీత సమయంలో సంక్షేమ పథకాలు అందించి, అభి వృద్ధి పనులు చేపట్టాలని ఆదేశించారు. గిరిజన సంఘాల నాయకులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఇక సీతంపేట ఐటీడీఏ కార్యాలయంలో స్వప్నిల్ జగన్నాథ్ సీటీసీలపై సంతకాలు చేసి విధుల్లో చేరారు. తొలుత వివిధ శాఖల సెక్టోరియల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. అనంతరం గిరిజనుల అభివృద్ధికి ఐటీడీఏ ద్వారా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఏపీవో చిన్నబాబు, డీడీ అన్నదొర తదితరులు పాల్గొన్నారు.

165 గ్రామాల్లో ఆదికర్మయోగి

● కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

పార్వతీపురం, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): జిల్లాలో 165 గిరిజన గ్రామాల్లో ఆదికర్మయోగి కార్యక్రమం చేపట్టనున్నట్లు కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్ నుంచి సంబంధిత అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలో 50 పైగా జనాభా కలిగిన 165 గిరిజన గ్రామాలను ఎంపిక చేశామని, ఆదికర్మయోగితో దాదాపు 83 వేల మంది గిరిజనులు ప్రయోజనం పొందుతారని వెల్లడించారు. దీనిపై రాష్ట్రస్థాయిలో ఐటీడీఏ ఏపీవో ఎ.మురళీధర్ శిక్ష పొందారన్నారు. జిల్లాలోని 12 మండలాల నుంచి 60 మంది ఆదికర్మ యోగులను ఎంపిక చేశామన్నారు. వారికి జిల్లా స్థాయి శిక్షకులతో స్థానిక ఐటీడీఏలో శిక్షణ ఇచ్చారని తెలిపారు.

గుండె సంబంధిత సమస్యలకు

నేడు ఉచిత వైద్య శిబిరం

● 18 ఏళ్ల లోపు వారికి మాత్రమే.. ● డీఎంహెచ్‌వో భాస్కరరావు

పార్వతీపురం, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): పిల్లల్లో గుండె సంబంధిత సమస్యలకు శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు డీఎంహెచ్‌వో భాస్కరరావు తెలిపారు. శుక్రవారం ఆయన విలేఖర్లతో మాట్లాడుతూ.. పార్వతీపురం జిల్లా కేంద్రాసుపత్రి సమీపంలో ఉన్న బాలల సత్వర చికిత్స కేంద్రంలో దానిని శిబిరం నిర్వహిస్తామన్నారు. 18 ఏళ్లలోపు ఉన్న బాలలకు విశాఖ మెడీకవర్ ఆసుపత్రి చిన్నపిల్లల వైద్య నిపుణులు అశోక్‌రాజు వైద్య బృందం వైద్య పరీక్షలు చేస్తారని వెల్లడించారు. అవసరమైన వారికి 2డీ, ఈకో తదితర వాటిని

(మిగతా 8వ పేజీలో...)



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో

సీతారామస్వామీ నువ్వు చేసిన నేరమేమి?

6లో

● అద్భుత శిల్పకళకు నిలయం గుళ్ల సీతారాంపురం ఆలయం
● 1200 ఎకరాలున్నా.. ధూపదీపాలు కరువు
● పట్టించుకోని దేవదాయ శాఖ

వసతి గృహాల మెరుగుకు చర్యలు

● కోర్టు ఆదేశాలతో నిధులు మంజూరు

6లో

24 గంటలూ అండగా..

● టోల్ ఫ్రీ నెంబర్లతో ఎంతో ఉపయోగం

కొత్త క్రిమినల్ చట్టాలపై అవగాహన ఉండాలి


● నేర సమీక్షలో ఎస్పీ మాధవరెడ్డి



మాట్లాడుతున్న ఎస్పీ

బెలగాం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): కొత్త క్రిమినల్ చట్టాలపై అవగాహన ఉండాలని ఎస్పీ ఎస్వీ మాధవరెడ్డి తెలిపారు. స్థానిక పోలీస్ కాన్ఫరెన్స్ హాల్‌లో పోలీసు అధికారులు, సిబ్బందితో నెలవారీ నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ' శాంతిభద్రతల పరిరక్షణలో రాజీ లేకుండా పని చేయాలి. పెండింగ్ కేసులను త్వరతగతిన పూర్తి చేయాలి. సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి నేరస్థులను పట్టు కోవాలి. గణేష్ ఉత్సవాల నేపథ్యంలో మండపాల ఏర్పాటుకు నిర్వాహకులు ఆన్‌లైన్ ద్వారా తప్పనిసరిగా అనుమతి పొందాల్సి ఉంది. పోలీస్ స్టేషన్‌లో నమోదైన ప్రతి కేసు వివరాలను సీసీటీఎన్ఎస్‌లో ఎప్పటికప్పుడు పొందుపరచాలి. కోర్టులో త్వరితగతిన అభియోగపత్రాలు సమర్పించాలి. బీఎన్ఎస్ఎస్ యాక్టు కేసుల్లో క్రైమ్ సీన్ విజిట్ నిమిత్తం ఆర్ఎఫ్ఎస్ఎల్ సాయం తీసుకోవాలి. ఎస్‌హెచ్‌వోలకు కంప్యూటర్ పరిజ్ఞానం తప్పనిసరి. ఈ-ఎఫ్ఐఆర్, జీరో ఎఫ్ఐఆర్ ప్రతి పోలీస్ స్టేషన్‌లో అమలు చేయాలి. హవాలా, వాహన దొంగతనం, హ్యూమన్ ట్రాఫింగ్ సంబంధించిన నేరాలపై దృష్టి సారించాలి. ఎస్‌హెచ్‌వోలకు ఎన్‌సీఆర్‌బీ పోర్టల్ లాగిన్ ఉంది. సైబర్ నేరాల్లో కావలిసిన సమాచారం కోసం బ్యాంకులకు నేరుగా లేఖ పెట్టొచ్చు.' అని తెలిపారు. అంతకుముందు శాంతి భద్రతల పరిరక్షణ, గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసులు, మర్డర్, ప్రాపర్టీ, చీటింగ్, గంజాయి, రోడ్డు ప్రమాదాలు తదితర కేసులపై సమీక్షించారు. పెండింగ్ కేసులపై ఆరా తీసి వాటి పరిష్కారానికి తగిన సూచనలు, సలహాలు అందించారు. అనంతరం విధుల్లో ప్రతిభ కనబరిచిన పోలీస్ సిబ్బంది, అధికారులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ సమావేశంలో పార్వతీపురం ఏఎస్పీ అంకితా సురాన, డీఎస్పీ థామస్ రెడ్డి, సీఐలు తదితరులు పాల్గొన్నారు.

సీతారామ స్వామీ.. నువ్వు చేసిన నేరమేమి?


సీతారాముల ఆలయ గోపురం

- అద్భుత శిల్పకళకు నిలయం గుళ్ల సీతారాంపురం ఆలయం
- 1200 ఎకరాలున్నా.. ధూపదీపాలు కరువు
- పట్టించుకోని దేవదాయ శాఖ

రాజాం/సంతకవిటి, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): అద్భుత శిల్పకళకు నెలవు గుళ్లసీతారాంపురంలోని సీతారాముల ఆలయం. ఈ ఆలయానికి సుదీర్ఘ చరిత్ర ఉంది. 16వ శతాబ్దంలో బొబ్బిలి రాజవంశీయులు నిర్మించినట్టు కట్టించినట్టు స్థల పురాణం చెబుతోంది. విహార యాత్రతో పాటు మృగాలను వేటాడేందుకు బొబ్బిలి రాజులు ఈ ప్రాంతానికి వచ్చేవారు. రాజుల కలలో సీతారాములు కనిపించడంతో ఇక్కడ ఆలయాన్ని నిర్మించినట్టు చరిత్ర చెబుతోంది. ఎక్కడైనా సీతారాముల ఆలయాల్లో సీతారాములతో పాటు లక్ష్మణుడి విగ్రహం ఉంటుంది. ఇక్కడ మాత్రం కేవలం సీతారాముల విగ్రహాలే ఉంటాయి. అందుకే ఆలయానికి ఏకాంత సీతారాముల ఆలయం అని పేరు వచ్చింది. బొబ్బిలిలోని ఆలయంలోనూ ఇలాగే ఉంటుంది. ఇక్కడి ఆలయ గోడలపై సింహపుతలల నగిషీలు, ప్రతిమలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. ప్రాచీన భారత శిల్పకళా సౌందర్యానికి అద్దం పట్టేలా కట్టడాలు, నిర్మాణాలు ఉంటాయి. ఏకరాతితో కూడుకున్న పెద్దపెద్ద శిలలతో ఈ ఆలయం చూడముచ్చటగా ఉంటుంది.

పట్టించుకోని దేవదాయ శాఖ..

ఈ ఆలయం దేవదాయ శాఖ పరిధిలో ఉంది. దేవుడి మాన్యంగా 1200 ఎకరాల భూమి ఉంది. కౌలురైతుల చేతుల్లో భూమి ఉంది. ధూప దీప నైవేద్యానికి ఆదాయం లేకుండా పోతోంది. ఏటా మార్చిలో తూతూ మంత్రంగా డోలోత్సవాలు నిర్వహిస్తుంటారు. ఈ ఆలయ అభివృద్ధిపై దేవదాయ శాఖ దృష్టి పెట్టడం లేదు. గతంలో ఏటా 18 రోజుల పాటు డోలోత్సవాలు ఘనంగా నిర్వహించేవారు. కానీ కాలక్రమేణా తొమ్మిది రోజులకు కుదించారు. అది కూడా గ్రామస్థులు, దాతల సహకారంతోనే నిర్వహిస్తున్నారు.

పర్యాటకంగా ప్రాధాన్యం..

ఈ ఆలయాన్ని అభివృద్ధి చేస్తే ఆధ్యాత్మికంగా, పర్యాటకంగా గుర్తింపు లభించే అవకాశం ఉంది. రాజాం నియోజకవర్గానికి సంబంధించి వంగర మండలంలోని సంగమేశ్వరాలయం, గుళ్లసీతారాంపురంలోని సీతారాముల ఆలయాలు పురాతనమైనవి. మడ్డువలస రిజర్వాయర్ చెంతనే సంగమేశ్వరాలయం ఉంటుంది. ఏటా వేలాది మంది భక్తులు ఇక్కడికి తరలివస్తారు.


అప్పట్లో ఏర్పాటు చేసిన రాతి విగ్రహాలు

కార్తీక మాసంలో అయితే పవిత్ర నదీ జలాల్లో స్నానం ఆచరించి సంగమేశ్వరుడిని దర్శించుకుంటారు. వన సమారాధనలకు ఉత్తరాంధ్ర నుంచి భక్తులు, పర్యాటకులు తరలివస్తుంటారు. గుళ్ల సీతారాంపురం ఆలయానికి భక్తుల తాకిడి అధికంగా ఉంటుంది. కానీ ఆలయ పరిస్థితిని చూసి భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తుంటారు. ఏకశిలతో రాతి కట్టడాలు, నగిషీలు, ప్రతిమలు వంటి వాటి నిర్వహణను కూడా గాలికొదిలేశారు. ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వం నుంచి రూపాయి నిధులు రాలేదు. అటు ఆలయానికి భూములు ఉన్నా ఆశించిన స్థాయిలో కౌలు రావడం లేదు. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత కదలిక వచ్చింది. ఇటీవల ప్రతిపాదనలు కూడా వెళ్లాయి. దీని అభివృద్ధికి నిధులు విడుదల చేస్తే మంచిది.


సీతారాముల విగ్రహాలు

ప్రభుత్వం దృష్టి సారించాలి..

ఈ ఆలయ అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి సారించాలి. ఇటువంటి పురాతన ఆలయాల ప్రాశస్త్యాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉంది. 400 సంవత్సరం నాటి ఆలయమది. అద్భుత శిల్పకళా సౌందర్యానికి మచ్చుతునక. కానీ వైసీపీ సర్కారు నాలుగున్నర సంవత్సరాలుగా గాలికొదిలేసింది.

-పాలూరి సిద్ధార్థ, రాజాం

అభివృద్ధి చేయాలి..

గుళ్లసీతారాంపురం సీతారాముల ఆలయాన్ని ఆధ్యాత్మిక, పర్యాటకంగా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉంది. అటు వంగరలోని సంగమేశ్వరాలయం సైతం అత్యంత పురాతనమైనది. కానీ ప్రభుత్వం కనీసస్థాయిలో కూడా దృష్టి పెట్టడం లేదు. వాటిని అభివృద్ధి చేస్తే పర్యాటకంగానూ గుర్తింపు పొందే అవకాశం ఉంది.

-కొత్త సాయిప్రశాంత్‌కుమార్, రాజాం

24 గంటలూ అండగా..



- టోల్ ఫ్రీ నెంబర్లతో ఎంతో ఉపయోగం

రాజాం రూరల్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): కొన్ని అంకెలు.. 24 గంటలూ ఆపదలో అండగా నిలుస్తున్నాయి. ఏ క్షణంలో ఏం ప్రమాదం ముంచుకొచ్చినా.. తెలిసీ తెలియని పరిస్థితుల్లో చిక్కుల్లో పడినా.. ఆదుకునేందుకు భరోసానిస్తాయి. ప్రమాదం సంభవించే సమయంలో అందుబాటులో ఎవరూ లేకపోయినా.. కాల్ చేస్తే రక్షిస్తున్నాయి. కొన్నిసార్లు ప్రాణాపాయం నుంచి రక్షిస్తున్నాయి. అవే టోల్‌ఫ్రీ నెంబర్లు. ఆ నెంబర్లకు కాల్‌చేసి సమస్య చెబితే.. సంబంధిత అధికారులు తక్షణమే స్పందిస్తున్నారు. ఆ నెంబర్లలో కొన్ని..

● 100



ఈ నెంబర్‌కు కాల్‌చేస్తే సమీప పోలీసులు అందుబాటులోకి వస్తారు. ఎందుకు కాల్ చేశామో, ఎలాంటి సమస్యలో ఇరుక్కున్నామో, ఎవరివల్ల ఇబ్బందులు తలెత్తాయో, ఎక్కడున్నామో, ఎలాంటి సహాయం కోరుకుంటున్నామో వారికి తెలియజేస్తే క్షణాల్లో స్పందిస్తారు. మనం కాల్‌చేసే సమీపంలోని పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇస్తారు.

● 1098



బాలలపై లైంగిక వేధింపులు.. బాల కార్మికుల గుర్తింపు.. అక్రమ రవాణా.. చిన్నారులు మాదకద్రవ్యాలకు అలవాటు పడితే ఈ నెంబర్‌కు కాల్‌చేసి చెప్పవచ్చు. అధికారులు స్పందిస్తారు. ఆ పిల్లలు ఎక్కడున్నారో గుర్తించి వారిపరిధిలో చేయాల్సిన సహాయం చేస్తారు. ప్రత్యేక పరిస్థితుల్లో బాలల సంరక్షణ కేంద్రాలకు తరలించే ఏర్పాట్లు చేస్తారు.

● 1930



సైబర్ నేరగాళ్ల బారినపడి నష్టపోతే వెంటనే ఈ నెంబర్‌కు కాల్ చేయాలి.. బ్యాంకు ఖాతా నుంచి నగదు మాయమైనా, తెలిసో తెలియకో పని ఒత్తిడిలో ఉన్న సమయంలో బయటనుంచి వచ్చిన కాల్‌కు ఆన్సర్ చేసి ఓటీపీలు చెబితే ఖాతాలోని నగదు మాయమైనా, డిజిటల్ అరెస్ట్ పేరుతో ఎవరైనా బెదిరించినా, అపరిచిత వ్యక్తులు కాల్‌చేసి మోసగించినా.. తక్షణమే ఈ నెంబర్‌కు కాల్ చేసి చెప్పాలి. పోలీసులు రంగంలోకి దిగి నగదు చేతులు మారకుండా బ్యాంకు ఖాతాలను ఫ్రీజ్ చేయిస్తారు. కేసు నమోదు చేసి సంబంధిత పోలీస్‌స్టేషన్‌కు వివరాలు పంపుతారు.

● 1073



ట్రాఫిక్ పోలీసులు తమ సేవల్ని నిరంతరాయంగా అందించేందుకు ఈ నెంబర్‌ను అందుబాటులోకి తెచ్చారు. రోడ్‌పై ట్రాఫిక్ జాం అయినా, ప్రమాదాలు సంభవించినా ఇతరత్రా పరిస్థితుల్లో ఈనెంబర్‌కు కాల్‌చేసి వారి సేవల్ని ఉపయోగించుకోవచ్చును.

● 181




గృహ హింస, మహిళలు, విద్యార్థినులను బంధించినా ఈ నెంబర్‌కు సమాచారం ఇస్తే తక్షణమే వన్‌స్టాప్ కేంద్రం సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుంటారు. న్యాయపరంగా, ఇతర విషయాల్లోనూ బాధితులకు అండగా నిలుస్తారు.

● 101



అగ్నిమాపకశాఖ అధికారుల సేవలు వినియోగించుకునేందుకు ఈ నెంబర్‌ను అందుబాటులోకి తెచ్చారు. ఇళ్లు, షాపింగ్ మాల్స్ ఇతరత్రా ప్రదేశాలలో అగ్నిప్రమాదాలు సంభవించినా, గ్యాస్ లీక్ ద్వారా మంటలు చెలరేగి ప్రమాదాలు చోటుచేసుకున్నా, బోరుబావి ప్రమాదాలు, నీళ్లలో మునిగిపోయే పరిస్థితులు తలెత్తినా కాల్‌చేసి సరైన సమాచారం ఇచ్చి రక్షణ పొందవచ్చు.

● 1912



ట్రాన్స్‌కో అందిస్తున్న సేవల్లో అంతరాయం ఏర్పడినా, లోఓల్టేజీ సమస్య తలెత్తినా, విద్యుత్ షార్ట్ సర్క్యూట్ సంభవించినా, వీధిదీపాలు వెలగకపోయినా, బిల్లులు సక్రమంగా రాకపోయినా ఈ టోల్‌ఫ్రీ నెంబర్‌కు కాల్‌చేసి సమస్య చెప్పవచ్చు.

ఎక్కువ కేసుల రాజీకి కృషి చేయాలి

రాజాం రూరల్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): వచ్చేనెల 13న నిర్వహించనున్న జాతీయ లోక్‌అదాలత్‌లో వీలైనన్ని ఎక్కువ కేసులు రాజీ అయ్యేందుకు న్యాయవాదులు సహకరించాలని మండల న్యాయసేవా సంస్థ అధ్యక్షురాలు, సీనియర్ న్యాయాధికారి కె.శారదాంబ పిలుపునిచ్చారు. అనుకూలమైన అన్ని క్రిమినల్, సివిల్ కేసులను పరస్పర ఆమోదంతో రాజీ చేసుకోవచ్చని ఆమె స్పష్టం చేశారు. కోర్టు ప్రాంగణంలో న్యాయవాదులతో న్యాయాధికారి శుక్రవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లోక్‌అదాలత్‌ది అంతిమతీర్పుగా స్పష్టం చేశారు. అదాలత్‌లో పరిష్కరించుకున్న సివిల్ కేసులకు సంబంధించి కోర్టుఫీజు వాపస్ ఇవ్వనున్నట్టు వివరించారు. సమావేశంలో సివిల్ న్యాయాధికారి సిహెచ్.హరిప్రియ, ప్రభుత్వ న్యాయవాది శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సీనియర్ న్యాయాధికారి శారదాంబ


ఎస్పీ వకుల్ జిందాల్‌ను కలిసిన హోంగార్డులు

మరింత ఉన్నత సేవలు అందించాలి

- కానిస్టేబుళ్లుగా ఎంపికైన హోంగార్డులకు ఎస్పీ అభినందన

విజయనగరం క్రైం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): హోంగార్డులుగా విధులు నిర్వహించి కానిస్టేబుళ్లుగా ఎంపికైన వారు అనుభవంతో మరింత ఉన్నతంగా సేవలు అందించాలని ఎస్పీ వకుల్ జిందాల్ అన్నారు. శుక్రవారం వారంతా ఎస్పీ వకుల్ జిందాల్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయన వారిని అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవగాహన, అనుభవం ఉన్నందున క్రమశిక్షణ, నిజాయితీతో పనిచేసి పోలీసు శాఖ ఔన్నత్యాన్ని మరింత పెంచాలన్నారు. నిబద్ధతతో పనిచేసి ప్రజలకు మరింత సమర్థంగా సేవలు అందించాలని సూచించారు. ఎస్పీ వకుల్‌జిందాల్‌ని కలిసిన వారిలో హోంగార్డులు నాగరాజు, ఈశ్వరరావు, గౌరీనాయుడు, సత్యనారాయణ, దేవి, ఎం.గౌరీనాయుడు ఉన్నారు. హోంగార్డుల ఇన్‌చార్జి ఆర్ఐ రమేష్ కుమార్, హెచ్‌సీలు శ్రీను, రాజు పాల్గొన్నారు.

వసతి గృహాల మెరుగుకు చర్యలు

- కోర్టు ఆదేశాలతో నిధులు మంజూరు
- ప్రారంభం కానున్న పనులు


బొబ్బిలి ఎస్సీ సంక్షేమ వసతి గృహం

బొబ్బిలి, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): సంక్షేమ వసతి గృహాల్లో సౌకర్యాల మెరుగు కోసం ఉన్నత న్యాయస్థానం ఇచ్చిన ఆదేశాల మేరకు ఇటీవల నిధులు మంజూరయ్యాయి. అత్యంత అధ్వానంగా ఉన్న వసతిగృహాల్లో తగిన వసతి, సౌకర్యాలు కల్పించకపోతే విద్యార్థులు ఎలా ఉండగలరని ఉన్నత న్యాయస్థానం ఆక్షేపించిన సంగతి తెలిసిందే. ఈ మేరకు పలువురు న్యాయాధికారులు ఇటీవల వసతిగృహాలను తనిఖీ చేసి, నివేదిక సమర్పించారు. ఈనేపథ్యంలో ప్రభుత్వం వసతిగృహాలకు నిధులను మంజూరు చేసింది. ఈ నిధులతో కొన్ని వసతి గృహాల్లో మరమ్మతులు చేపట్టారు. ఇంకా చాలా చోట్ల పనులు ప్రారంభించాల్సి ఉంది.

● బొబ్బిలి సహాయ సంక్షేమ శాఖాధికారి పరిధిలో రామభద్రపురం హాస్టల్‌కు రూ.18.15 లక్షలు, బాడంగి హాస్టల్‌కు రూ.22.15లక్షలు, తెర్లాంకు రూ.24.15లక్షలు, పెరుమాలికి రూ.22.65 లక్షలు, జీఎస్ పురంనకు రూ.12.45 లక్షలు, బొబ్బిలి కళాశాల బాలుర హాస్టల్‌కు రూ.18.65 లక్షలు, బొబ్బిలి కళాశాల బాలికల హాస్టల్‌కు రూ.14.65 లక్షలు, రాజాం కళాశాల బాలుర హాస్టల్‌కు రూ.30.80 లక్షలు, రాజాం కళాశాల బాలికల హాస్టల్‌కు రూ.17.35 లక్షలు మంజూరయ్యాయి.

● తెర్లాం వసతిగృహం భవనం మరమ్మతులకు అనుకూలించదని ఆర్‌అండ్‌బీ అధికారులు నివేదిక ఇవ్వడంతో అక్కడ మరమ్మతులు ప్రారంభించలేదని ఏఎస్‌డబ్ల్యువో సత్యనారాయణ తెలిపారు.

● బొబ్బిలి సహాయ బీసీ సంక్షేమ అధికారి పరిధిలోని హాస్టళ్లకు రూ.20 లక్షలు మంజూరయ్యాయి. రెండో విడతలో మరో రూ.20లక్షల మేర ప్రతిపాదనలు పంపించారు.

వైభవంగా శ్రావణ శుక్రవారం పూజలు

54 చీరలతో కనకమహాలక్ష్మికి అలంకరణ

విజయనగరం కల్చరల్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): నగరంలోని సిటీబస్టాండ్‌లో ఉన్న అభయాంజనేయస్వామి, కనకమహాలక్ష్మి ఆలయంలో శ్రావణ శుక్రవారం సందర్భంగా 54 చీరలతో అమ్మవారికి ప్రత్యేకంగా అలంకరించారు. ముందుగా అమ్మవారికి పంచామృతాభిషేకం చేశారు. నగరంలోని వివిధ ప్రాంతాల భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. నగరంలోని పైడిమాంబ వనం, చదురు గుడులు, కన్యకాపరమేశ్వరి, జ్ఞాన సరస్వతి ఆలయం, పాత బస్టాండ్‌లోని దుర్గాదేవి ఆలయం, హిమగిరి, సప్తగిరి కాంప్లెక్స్ రోడ్డులో ఉన్న సంతోషిమాత ఆలయాల్లో భక్తులు పూజలు చేశారు.


54 చీరెలతో కనకమహాలక్ష్మీ అమ్మవారికి ప్రత్యేకాలంకరణ




పాలకొండలో కోటదుర్గమ్మ..

సాలూరు/రూరల్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): సాలూరు ఇలవేలుపు కామాక్షి అమ్మవారి ఆలయంలో శ్రావణ ఐదో శుక్రవారం పూజలు అత్యంత వైభవంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని, ఆలయ ప్రాంగణంలో భక్తిశ్రద్ధలతో అమ్మవారికి పూజలు చేశారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఆలయ సిబ్బంది తగు చర్యలు తీసుకున్నారు.

● పాలకొండ, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్రుల ఆరాధ్య దేవత, పాలకొండ పట్టణంలో వెలసిన కోటదుర్గమ్మ ఆలయంలో శ్రావణమాసం చివరి శుక్రవారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి, లక్ష్మీదేవికి ఆలయ ప్రధాన అర్చకుడు లక్ష్మీప్రసాదశర్మ ఆధ్వర్యంలో విశేష పూజలు, ప్రత్యేక కుంకుమార్చనలు చేశారు. సుమారు 1500 మంది మహిళలు పాల్గొన్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా ఆలయ ఈవో సూర్యనారాయణ చర్యలు తీసుకున్నారు.


సాలూరు/రూరల్: కామాక్షి ఆలయ ప్రాంగణంలో కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు


అష్టలక్ష్మీ దేవాలయంలో సామూహిక కుంకుమ పూజల్లో పాల్గొన్న మహిళలు


విజయనగరం బొండాడవీధిలోని కామాక్షి అమ్మవారు

రావమ్మా.. మహాలక్ష్మి

విజయనగరం టౌన్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): నగరంలోని వివిధ ఆలయాల్లో శ్రావణమాసం ఐదో శుక్రవారం సందర్భంగా సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. మహిళలతో దేవాలయాలు సందడిగా కనిపించాయి. పంచముఖ ఆంజనేయస్వామి, బొండాడ వీధిలోని కామాక్షి అమ్మవారి ఆలయాల్లో సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. దుప్పాడ అష్టలక్ష్మీ దేవాలయం అర్చకులు రమేష్ ఆధ్వర్యంలో లక్ష్మీదేవికి తిరువీధులు నిర్వహించారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

న్యూస్ బాక్స్

రాజాంలో 6 బార్లు

రాజాం రూరల్/రాజాం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): నూతన బార్ పాలసీ ప్రకారం రాజాం మున్సిపాలిటీ పరిధిలో ఆరు బార్లు ఏర్పాటుకు ప్రభుత్వం నోటిఫై చేసిందని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సి.ఐ. ఆర్.జైభీం తెలిపారు. వీటిలో ఒక బార్‌ను గీత కార్మికులకు కేటాయించినట్టు చెప్పారు. మిగిలిన అయిదు బార్లకు ఆసక్తి ఉన్నవారు ఈనెల 26 లోగా దరఖాస్తు చేసుకోవచ్చని ఆయన వెల్లడించారు. గీత కార్మికులు దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 29ని గడువుగా ప్రభుత్వం నిర్ణయించిందని సి.ఐ. పేర్కొన్నారు. బార్ల ఎంపికకు సంబంధించి ఈనెల 28, 30 తేదీలలో వేర్వేరుగా డ్రా తీయనున్నట్టు ఆయన వివరించారు.

పర్యావరణ పరిరక్షణే ధ్యేయం

వేపాడ, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా హరిత సొసైటీ పని చేస్తుందని వ్యవస్థాపకులు ఆర్.హరిబాబు అన్నారు. వినాయక చవితి సందర్భంగా ఏటా మట్టి వినాయక విగ్రహాల పంపిణీ కార్యక్రమాన్ని చేపడుతున్నట్టు తెలిపారు. మండలంలోని సింగరాయి, జగ్గయ్యపేట, ఉసిరి గ్రామాలలో మట్టి విగ్రహాలను శుక్రవారం పంచినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో సొసైటీ ఉపాధ్యక్షులు చల్లా త్రినాథ్, సభ్యులు ఎం.అప్పలనాయుడు, ఆర్.భవాని, ఎం.గణేష్ తదితరులు పాల్గొన్నారు.

రేపు కొత్తపేటలో ఉట్లోత్సవం

విజయనగరం రూరల్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): శ్రీ కృష్ణ జన్మాష్టమి ఉత్సవాల్లో భాగంగా ఈ నెల24న కొత్తపేట కోదండ రామాలయం వద్ద ఉట్ల సంబరం జరగనుంది. ఆదివారం మధ్యాహ్నం 4 గంటలకు ఉట్ల సంబరం, 6 గంటలకు ఊరేగింపు కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. కృష్ణుని వేషధారణలు, సాముగరిడీలతో ఈ ఊరేగింపు జరగనుంది. ఈ మేరకు ఉత్సవ కమిటీ ఏర్పాట్లు పూర్తి చేసింది. ఉత్సవాలలో భాగంగా శుక్రవారం రామాలయంలో భజన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

మండపాలకు అనుమతి తప్పనిసరి

డెంకాడ, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): వినాయక మండపాలు ఏర్పాటు చేసేవారు తప్పనిసరిగా పోలీసుల అనుమతి తీసుకోవాలని ఎస్‌ఐ సన్యాసినాయుడు తెలిపారు. శుక్రవారం స్థానిక పోలీసు స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ కమిటీ సభ్యులు తప్పనిసరిగా మండపాలు ఏర్పాటు చేసే ప్రదేశాలు, ఉత్సవాలు, నిమజ్జనం జరిపే తేదీలు పూర్తి వివరాలతో కూడిన సమాచారాన్ని ముందస్తుగా పోలీసులకు అందజేయాలన్నారు. మండపాల వద్ద వినోద కార్యక్రమాలు, మైకులకు అనుమతి తప్పనిసరన్నారు. డీజేలకు ఎటువంటి అనుమతి లేదని చెప్పారు.

స్వామిత్వ సర్వేను వినియోగించుకోండి

లక్కవరపుకోట, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలో జరుగుతున్న స్వామిత్వ సర్వేను ప్రజలు సద్వినియోగంచేసుకోవాలని ఎంపీడీవో ఎస్.అప్పారావు తెలిపారు. కూర్మవరం, దాసుల్లుపాలెం, నిడిగట్టు, గంగుబూడి, శ్రీరాంపురం, రేగ, లచ్చింపేట, నర్సంపేట, పోతంపేట, కల్లెంపూడి, కుద్దువలస గ్రామాల్లో సర్వే చేస్తున్నామని చెప్పారు. స్వామిత్వ సర్వే వల్ల గ్రామకంఠాల భూములు రెగ్యులర్ అవుతాయని, క్రయవిక్రయాలకు రిజిస్ట్రేషన్ పరంగా చెల్లుబాటు అవుతాయన్నారు. దీంతో గృహ రుణాలు, బ్యాంకు లోన్లు పొందవచ్చునన్నారు. ఇళ్లతో పాటు ఖాళీ స్థలాలను పరిగణనలోకి తీసుకుంటామని, సర్వే అనంతరం పూర్తి హక్కులు యజమానులకు వస్తాయని తెలిపారు.

సర్వే పరిశీలన...

జామి, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): భీమసింగి, బలరాంపురం గ్రామాల్లో జరుగుతున్న స్వామిత్ర సర్వేను డీఎల్‌పీవో శిరీషరాణి శుక్రవారం పరిశీలించారు. అనంతరం ఆయా గ్రామాల్లో ఎస్‌డబ్ల్యూపీసీ ప్లాంట్స్, వాటర్‌ట్యాంక్‌లు, క్లోరినేషన్ తీరును చూశారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ ఉమ తదితరులు పాల్గొన్నారు.

వాసవీ మాతకు బిస్కెట్లతో అలంకరణ

జామి, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన జామిలో కొలువైన శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారికి శ్రావణ శుక్రవారం సందర్భంగా ఆర్యవైశ్య మహిళలు చాక్లెట్లు, బిస్కెట్లతో ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం అమ్మవారికి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

జానపద కళలను పరిరక్షించండి



ర్యాలీలో పాల్గొన్న జానపద కళాకారులు

విజయనగరం రింగురోడ్డు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): జానపద కళలను పరిరక్షించాలని కళాకారులు ప్రభుత్వాన్ని కోరారు. కళాకారులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. నగరంలోని గిడుగు రామమూర్తి తెలుగు భాష, జానపద కళాపీఠం ఆధ్వర్యంలో అంతర్జాతీయ జానపద దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కోట జంక్షన్ నుంచి గంటస్తంభం మీదుగా పాత బస్టాండ్ వరకూ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో జముకుల పాట, గంగిరెద్దుల ఆట, తప్పెటగుళ్లు, చెక్క భజన, కోలాటం, బుర్రకథ, పగటివేషాలు, పకీరు వేషంతో ఊరేగింపులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళాపీఠం వ్యవస్థాపక అధ్యక్షులు బద్రి కూర్మారావు మాస్టారు మాట్లాడుతూ ఒకప్పుడు ప్రజలకు విజ్ఞానాన్ని, వినోదాన్ని అందించిన జానపద కళలు నేడు అంతరించిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. జానపద కళాకారులకు ఉపాధి లేక తరువాత తరాలకు కళలను అందించలేకపోతున్నారని అన్నారు. ఈ కళల పరిరక్షణ కోసం 20 ఏళ్లుగా కళాపీఠం ఆధ్వర్యంలో కళాకారులను వెలుగులోకి తెచ్చి వారికి సేవలు అందిస్తున్నట్టు తెలిపారు. ప్రజానాట్యమండలి అధ్యక్షుడు పి.షణ్ముఖరావు మాట్లాడుతూ కళాకారులకు 50 ఏళ్లకు పించను, బస్సు పాస్ ఇప్పించాలని కోరారు. ఇళ్లు, ఆరోగ్యకార్డులు ఇప్పించాలన్నారు. కార్యక్రమంలో షేక్ గౌస్‌బాషా, చీకటి దివాకర్, దవళ సర్వేశ్వరరావు, చంద్రికారాణి, ఫణీశ్రీ, ఫైడిరాజు, హేమ, శోధన, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

సిబ్బంది సమస్యల పరిష్కారానికి చర్యలు: ఎస్పీ


సిబ్బంది సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీ వకుల్ జిందాల్

విజయనగరం క్రైం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వివిధ హోదాల్లో పనిచేస్తున్న పోలీసు సిబ్బంది, అధికారుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని ఎస్పీ వకుల్ జిందాల్ అన్నారు. శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీసు వెల్ఫేర్ డేను నిర్వహించారు. సిబ్బంది నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసు సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తామన్నారు. సిబ్బంది వ్యక్తిగత, వృత్తిపరమైన, శాఖాపరమైన సమస్యలు తెలుసుకుని వాటిని పరిశీలించి పరిష్కారానికి చర్యలు చేపడతామని భరోసా ఇచ్చారు.

పార్లమెంటు అధ్యక్ష ఎంపిక కమిటీలో నాగార్జున


కిమిడి నాగార్జున

చీపురుపల్లి, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): గుంటూరు పార్లమెంటు టీడీపీ అధ్యక్ష ఎంపిక కమిటీలో విజయనగరం జిల్లా పార్టీ అధ్యక్షుడు, డీసీసీబీ ఛైర్మన్ కిమిడి నాగార్జునను నియమించారు. ఈ మేరకు పార్టీ ఉత్తర్వులు జారీ చేసింది. గుంటూరు పార్లమెంటు అధ్యక్షుని ఎంపిక కోసం తెలుగుదేశం పార్టీ ముగ్గురు సభ్యులతో కమిటీని నియమించింది. ఈ కమిటీలో మంత్రి ఎన్ఎండీ ఫరూక్, ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజులతో బాటు కిమిడి నాగార్జున సభ్యులుగా ఉంటారు. అక్కడి నాయకులు, పార్టీ కార్యకర్తలతో చర్చించి పార్లమెంటు అధ్యక్ష నియామకం కోసం వీరు ముగ్గురి పేర్లను అధిష్ఠానానికి సిఫారసు చేస్తారు.

రైతులకు అండగా ఉంటామని..


ఎమ్మెల్సీకి పత్రాలను అందిస్తున్న రేవళ్లపాలెం రైతులు

ఎస్.కోట రూరల్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): బొడ్డవర ప్రాంతంలో తమకు జిందాల్ కంపెనీ అన్యాయం చేసిందని ఆరోపిస్తూ గడిచిన 60 రోజులుగా శాంతియుత నిరసనలు చేస్తున్న రైతులకు తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని రేవళ్లపాలెం రైతులు పేర్కొన్నారు. శుక్రవారం గ్రామానికి వెళ్లిన ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజును కలిసి వారికి ప్రభుత్వం న్యాయం చేయాలని కోరుతూ సంతకాలు చేసిన పత్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సోమేశ్వరరావు, గ్రామపెద్ద జాగరపు రామకృష్ణ, వీరనారాయణం ఎంపీటీసీ సభ్యుడు గోవిందరావు, నాయకులు శర్మ, వెంకటరావు, పోతయ్య తదితరులు పాల్గొన్నారు.

పట్టించుకోకపోవడం దారుణం

జిందాల్ యాజమాన్యం తమకు న్యాయం చేయాలని రైతులు కోరుతున్నా ఏ అధికారీ పట్టించుకోకపోవడం దారుణమని జిల్లా రైతు సంఘ ఉపాధ్యక్షుడు చల్లా జగన్ అన్నారు. అధికారులు, పెద్దల తీరు చూస్తుంటే వీరు జిందాల్ రియల్ ఎస్టేట్‌లో వాటాదారుల్లా అనిపిస్తున్నారని వ్యాఖ్యానించారు. శుక్రవారం నిర్వాసితుల నిరసనలో ఆయన పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే ధ్యేయం


వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే లోకం నాగమాధవి

భోగాపురం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే లోకం నాగమాధవి అన్నారు. స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో శుక్రవారం ప్రజల నుంచి సమస్యలపై వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అన్ని వినతులను పరిష్కరించనున్నట్టు చెప్పారు.

పశువులకు ఉచిత చికిత్స

వేపాడ, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): నీలకంఠరాజపురం శివారు భర్తవానిపాలెం గ్రామంలో శుక్రవారం నిర్వహించిన ఉచిత శిబిరంలో పశువులకు గర్భకోశ చికిత్సలు చేసినట్టు మండల పశువైద్యాధికారి కె.గాయత్రి తెలిపారు. పశువుల పెంపకంలో తీసుకోవలసిన జాగ్రత్తలను పాడిరైతులకు ఆమె వివరించారు.

సొంత భవనం లేనందునే విద్యార్థులు దూరం


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు


ఎస్.కోటలో వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తూ..

భోగాపురం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): స్థానికంగా ఉన్న బీసీ వసతి గృహానికి సొంత భవనం లేక విద్యార్థులు చేరేందుకు విముఖత చూపుతున్నారని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు జె.రవికుమార్ అన్నారు. విద్యారంగ సమస్యలు పరిష్కరించాలంటూ శుక్రవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బీసీ వసతి గృహం శిథిలమై సంవత్సరాలు గడుస్తున్నా సొంత భవనం నిర్మించకపోవడం దారుణంగా ఉందన్నారు. పెండింగులో ఉన్న ఫీజు రీయంబర్స్‌మెంటు, తల్లికి వందనం నిధులు విడుదల చేయాలని కోరారు. విద్యార్థుల సమస్యల పరిష్కారం కోరుతూ ఈనెల 25న తలపెట్టిన చలో కలెక్టరేట్‌ను విజయవంతం చేయాలన్నారు. అనంతరం తహసీల్దార్ రమణమ్మకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రమేష్, రమణ, తేజ, ధనుష్, తదితరులు పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ...

శృంగవరపుకోట, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): శృంగవరపుకోట పట్టణంలో భారత విద్యార్థి ఫెడరేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం 'చలో కలెక్టరేట్' వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఈనెల 25న చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కూడా ఎలాంటి మార్పులు జరగడం లేదని ఎస్.ఎఫ్.ఐ. జిల్లా కమిటీ సభ్యురాలు వి.భారతి అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రత్న, అనిత, గౌరి, శంకర్ పాల్గొన్నారు.

25న చలో కలెక్టరేట్...

చీపురుపల్లి, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 25న విజయనగరంలో నిర్వహించనున్న చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎస్ఎఫ్ఐ ప్రతినిధులు కోరారు. ఈ మేరకు శుక్రవారం వారు పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు జగదీష్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది దాటుతున్నా, విద్యా రంగ సమస్యలు పరిష్కారానికి నోచుకోకపోవడం దురదృష్టకరమన్నారు. చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

డీజే శబ్దాలతో అనారోగ్య సమస్యలు


ర్యాలీలో పాల్గొన్న స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు

రాజాం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ఉత్సవాలలో డీజే శబ్దాల వల్ల అనేక అనారోగ్య సమస్యలు కలుగుతాయని వక్తలు అన్నారు. మానవత సంస్థ రాజాం శాఖ, వికాస తరంగిణి ఆధ్వర్యంలో శుక్రవారం రాజాంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. వివిధ స్వచ్ఛంద సంస్థల సభ్యులు, కళాశాలలు, పాఠశాలల విద్యార్థులు, సీఐ కె.అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సీఐ అశోక్‌కుమార్ మాట్లాడుతూ డీజే శబ్దాల నియంత్రణకు గట్టి చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మానవత ఛైర్మన్ కొత్త సాయిప్రశాంత్ కుమార్, అధ్యక్షులు అచ్యుత్‌కుమార్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ స్వప్న హైందవి, పెంకి చైతన్యకుమార్, నీలకంఠేశ్వరయాదవ్, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ముంజి షణ్ముఖరావు, గట్టి పాపారావు, గర్లంకి శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా ఓటరు జాబితా పరిశీలన

విజయనగరం రింగురోడ్డు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): త్వరలో జరగనున్న 34వ డివిజన్ ఉప ఎన్నికకు సంబంధించి క్షేత్రస్థాయిలో ఓటరు జాబితాను పరిశీలించే కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని సిబ్బందికి నగర పాలక సంస్థ సహాయ కమిషనర్ కిల్లాన అప్పలరాజు ఆదేశించారు. శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జాబితా ప్రకారం ఓటర్లు ఉన్నారా?లేదా అన్న విషయాన్ని తనిఖీ చేయాలన్నారు. వివరాలను నిర్ధారించుకుని తుది నివేదిక సమర్పించాలని సిబ్బందికి ఆదేశించారు. సమావేశంలో అసిస్టెంట్ సిటీ ప్లానర్ రమణమూర్తి, టీపీఓ అప్పలరాజు, టీపీఎస్ అనిత తదితరులు పాల్గొన్నారు.

నానో యూరియాను వినియోగించండి

ఎస్.కోట రూరల్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): రైతులు యూరియా వాడకాన్ని తగ్గించి.. దాని స్థానంలో నానో యూరియాను వినియోగించాలని వ్యవసాయశాఖ అధికారులు సూచించారు. సంతగైరమ్మపేటకు కొద్దిరోజులు క్రితం మంజూరైన డ్రోన్‌ను బ్యాంకు అధికారులు, మండల వ్యవసాయాధికారి రవీంద్ర శుక్రవారం పరిశీలించారు. అనంతరం డ్రోన్‌తో నానో యూరియా పిచికారీ తీరును చూపించారు.

పాఠశాలలను సందర్శించిన జేఎన్‌టీయూ బృందం

విజయనగరం రూరల్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): నగర శివార్లలోని జేఎన్‌టీయూ గురజాడలో మూడురోజుల మెంటార్‌షిప్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా రెండో రోజు శుక్రవారం జామి జిల్లా పరిషత్ హైస్కూల్, రామతీర్థం పాఠశాలలను జేఎన్‌టీయూ సిబ్బందితో పాటు పూణేలోని విజ్ఞానాశ్రమం మేనేజర్ కిషోర్ గైక్వాడ్, జిల్లా సైన్సు అధికారి రాజేష్, ఏటీఎల్ రాష్ట్ర పరిశీలకుడు వెంకటేష్, రమేష్‌లు సందర్శించారు. జామి ఏటీఎల్‌లో ల్యాబ్‌లో ప్రయోగాలను పరిశీలించి ఉపాధ్యాయులు, విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఉమామహేశ్వరరావు, లలిత, రామతీర్థం ప్రధానోపాధ్యాయుడు నగేష్, శ్రీనివాసరావు, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

లోవోల్టేజీ సమస్యను పరిష్కరిస్తాం


సమావేశంలో మాట్లాడుతున్న డీఈ త్రినాథ్

మెరకముడిదాం, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): మండలంలో లోవోల్టేజీ సమస్యను తక్షణమే పరిష్కరిస్తామని ఈపీడీసీఎల్ గర్భాం సెక్షన్ ఆఫీసు డీఈ పి.త్రినాథ్ తెలిపారు. శుక్రవారం ఆయన ప్రజాప్రతినిధులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ మండల అధ్యక్షులు తాడ్డి సన్యాసినాయుడు మాట్లాడుతూ గర్భాం సెక్షన్ పరిధిలో ఉన్న గ్రామాల్లో సమస్యలను వివరించారు. దీనికి డీఈ పి.త్రినాథ్ స్పందిస్తూ గ్రామాల్లో లోవోల్టేజీ సమస్యను రాకుండా చేస్తామని, రైతులకు వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు త్వరగా ఇస్తామని హామీ ఇచ్చారు. సూర్యఘర్‌ను వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో భైరిపురం ఏఎంసీ ఛైర్మన్ తాడ్డి చంద్రశేఖర్, వైసీపీ నాయకులు తాడ్డి వేణుగోపాలరావు, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

క్రైం న్యూస్

భర్త హత్య కేసులో భార్యకు జీవిత ఖైదు

విజయనగరం క్రైం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): నగరంలోని టూటౌన్ పోలీసు స్టేషన్‌లో 2015లో నమోదైన హత్య కేసులో నిందితురాలు విశాఖ జిల్లా భీమిలి మండలం నగరపాలెం గ్రామానికి చెందిన గార వెంకట జ్యోతిర్మయికి జీవితఖైదు విధిస్తూ విజయనగరం ఎస్సీ, ఎస్టీ కోర్టు న్యాయమూర్తి బి.అప్పలస్వామి తీర్పు వెల్లడించినట్టు ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. అదే మండలం కాపులదిబ్బవాని పాలెంనకు చెందిన చొక్కా నరేష్, ఉప్పాడకు చెందిన పాడ రాజు అలియాస్ ముక్కు అనే ఇద్దరు నిందితులకు ఏడేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.500 చొప్పున జరిమానా విధించినట్టు తెలిపారు. వెంకట జ్యోతిర్మయికి రమేష్ అనే వ్యక్తితో వివాహమైంది. వీరికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. వీరు ఆనందపురం మండలం బొడ్డుపాలెం గ్రామంలో నివాసం ఉండేవారు. భర్త గార రమేష్‌కు సీమేన్‌గా ఉద్యోగం రావడంతో శిక్షణ నిమిత్తం 2015లో చైన్నై వెళ్లిపోయారు. భార్య వెంకట జ్యోతిర్మయికి భీమిలి మండలం కాపుల దిబ్బవానిపాలెంనకు చెందిన రాగాతి రాముతో పరిచయం ఏర్పడి వివాహేతర సంబంధానికి దారి తీసింది. భర్త రమేష్ శిక్షణ పూర్తి చేసుకుని వచ్చిన తరువాత వీరి విషయాన్ని గుర్తించి, భార్యను ప్రశ్నించాడు. ఈ విషయమై ఇద్దరి మధ్య వివాదాలు జరిగేవి. దీంతో రమేష్‌ను అడ్డు తొలగించేందుకు నిందితులు ప్రణాళిక రూపొందించారు. 2015 జూలై 26న రమేష్ తన భార్య వెంకట జ్యోతిర్మయిని ఇదే విషయమై ప్రశ్నించగా... ఆమె ప్రియుడు రాగాతి రాముకు ఫోన్ చేసి రప్పించింది. తలుపు చెక్కతో భర్త రమేష్ తలపై కొట్టగా అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ దృశ్యాన్ని జ్యోతిర్మయి రెండో కుమార్తె సౌమ్య చూసింది. ప్రియుడు రాగాతి రాము, చొక్కా నరేష్, రాజులతో కలిసి రమేష్ మృతదేహాన్ని జ్యోతిర్మయి అర్ధరాత్రి సమయంలో భీమిలి బీచ్‌కు తీసుకువెళ్లి పెట్రోలు పోసి కాల్చేశారు. అనంతరం రెండో కుమార్తె సౌమ్యను పూల్‌బాగ్‌లోని ఓ బావిలో చంపేసి పడేశారు. ఈ విషయం టూటౌన్ పోలీసులకు తెలిసింది. నిందితులు నలుగురిని అప్పటి టూటౌన్ సీఐ అంబేడ్కర్ అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. అనంతరం బాధ్యతలు చేపట్టిన సీఐలు దుర్గాప్రసాద్, విజయానంద్, రామారావులు దర్యాప్తు చేపట్టి నిందితులపై అభియోగ పత్రాలు దాఖలు చేశారు. దీంతో ప్రస్తుత సీఐ టి.శ్రీనివాసరావు న్యాయస్థానంలో సాక్ష్యాలను ప్రవేశపెట్టడంతో నిందితులకు శిక్ష ఖరారు చేసినట్టు ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. మరో నిందితుడు రాగాతి రాము విచారణ సమయంలోనే రోడ్డు ప్రమాదంలో మరణించాడని తెలిపారు. ఈ కేసులో క్రియాశీలకంగా వ్యవహరించిన సీఐ శ్రీనివాసరావు, కోర్టు కానిస్టేబుల్ లక్ష్మి, ఏఎస్ఐ మల్లేశ్వరరావులను ఎస్పీ వకుల్ జిందాల్ అభినందించారు.

యువతిపై లైంగిక దాడికి యత్నం

సమీప బంధువే ఘాతుకం

రేగిడి, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): తాగిన మైకంలో వరుసకు పెద్దనాన్న అయిన వ్యక్తే ఓ యువతిపై లైంగిక దాడికి యత్నించాడు. అటుగా వెళ్లిన యువకులు గుర్తించి అడ్డుకోవడంతో ఘోరం తప్పింది. ఓ గ్రామంలో గురువారం సాయంత్రం చోటుచేసుకున్న ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. శుక్రవారం యువతి బంధువులు నిందితుడిని స్తంభానికి కట్టి దేహశుద్ధి చేయడంతో విషయం బయటకు వచ్చింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ఓ గ్రామానికి చెందిన వ్యక్తి తనకు కుమార్తె వరుసైన యువతి పక్కపక్కనే నివాసం ఉంటున్నారు. ఇటీవల కాలంలో వేర్వేరు కారణాలతో యువతి అన్నయ్య, తండ్రి కన్నుమూశారు. దినసరి కూలీయైన తల్లితో ఆమె ఒంటరిగా నివాసం ఉంటోంది. గురువారం యథావిధిగా తల్లి వ్యవసాయ పనులకు వెళ్లింది. ఎవరూ లేని సమయంలో పెదనాన్న వరుసైన వ్యక్తి ఇంట్లోకి చొరబడి యువతిపై లైంగిక దాడికి యత్నించాడు. ఆమె కేకలు వేయటంతో అటుగా వెళుతున్న ఇద్దరు యువకులు గుర్తించి అడ్డుకున్నారు. ఈ విషయం యువతి బంధువులకు తెలియడంతో శుక్రవారం నిందితుడిని స్తంభానికి కట్టేసి... దేహశుద్ధి చేశారు. అనంతరం పోలీసులకు అప్పజెప్పారు. ఈ ఘటనపై బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నీలావతి శుక్రవారం విలేకరులకు తెలిపారు.

పాముకాటుతో మహిళ మృతి

సంతకవిటి, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): మల్లయ్యపేట గ్రామానికి చెందిన మూల అమ్మడు (49) పాముకాటుకు గురై మరణించినట్టు ఎస్ఐ ఆర్.గోపాలరావు తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం బుధవారం ఉదయం అమ్మడు తన భర్త వెంకటరావుతో కలసి పొలం పనులకు వెళ్లింది. పొలంలో పనులు చేస్తుండగా ఆమెకు పాము కాటు వేసింది. హుటాహుటిన శ్రీకాకుళంలోని ఓ ఆసుపత్రికి ఆమెను తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అమ్మడు గురువారం సాయంత్రం మరణించిట్లు భర్త వెంకటరావు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ గోపాలరావు తెలిపారు.

తోటపల్లి కాలువలో పడి వ్యక్తి మృతి

తెర్లాం, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని కవిరాయనివలస గ్రామంలో విషాదం చోటుచేసుకుంది. స్థానిక పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన జెమ్మల శంకరరావు(50) శుక్రవారం మధ్యాహ్నం బహిర్భూమికి వెళ్లి, గ్రామ సమీపంలో ప్రవహిస్తున్న తోటపల్లి కాలువ వద్ద ప్రమాదవశాత్తు కాలుజారి పడిపోయారు. దీంతో అక్కడికక్కడే మృతిచెందారు. గ్రామస్థులు పోలీసులకు సమాచారం అందించడంతో ఎస్ఐ సాగర్‌బాబు ఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడికి భార్య అప్పమ్మ, వివాహితులైన కుమార్తె, కుమారుడు ఉన్నారు. వీరంతా చెన్నైలో కూలి పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. శంకరరావు ఒక్కరే గ్రామంలో కూలి పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాడంగి సీహెచ్‌సీకి తరలించారు. మృతుడి తల్లి సూరమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

చెరువులో వ్యక్తి గల్లంతు

బొబ్బిలి రూరల్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎం.బూర్జవలస గ్రామ శివారున గల వెంకటపతిరాయి చెరువులో శుక్రవారం గుర్తు తెలియని వ్యక్తి గల్లంతయ్యాడు. చెరువు వైపు పొలానికి వెళ్తున్న ఓ మహిళ.. ఆ వ్యక్తి పడిపోవడాన్ని గమనించి, స్థానికులకు సమాచారం అందించింది. దీంతో గ్రామానికి చెందిన యువకులు గాలింపు చర్యలు చేపట్టారు. అయినా ఆ వ్యక్తి ఆచూకీ లభించలేదు. సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది వచ్చి గాలింపు చర్యలు చేపట్టారు. ఇంతవరకూ ఆచూకీ లభించలేదు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ రమేష్, ఏఎస్ఐ సన్యాసిరావు పాల్గొన్నారు.

నాగావళిలో గల్లంతైన వృద్ధుడు మృతి

సంతకవిటి, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): నాగావళిలో నదిలో గల్లంతైన ఉరదండ పోలయ్య (76)అనే వృద్ధుడు మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం... పోడలి గ్రామానికి చెందిన పోలయ్య (76) ఈ నెల 17న ఉదయం నాగావళి నదిలో గల్లంతయ్యారు. ఆయన ఆచూకీ తెలియకపోవడంతో నదిలో గల్లంతైనట్టు కుటుంబ సభ్యులు అనుమానించారు. దీంతో ఈ నెల 19వ తేదీ నుంచి అగ్నిమాపక సిబ్బంది, ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలు నదిలో గాలింపు చర్యలు చేపట్టారు. శుక్రవారం సాయంత్రం పొందూరు మండలం పెద్దబొడ్డేపల్లి వద్ద పోలయ్య మృతదేహం ఒడ్డుకు రావడంతో స్థానికులు అక్కడి వీఆర్వోకు సమాచారం అందించారు. ఆయన ఇక్కడి పోలీసులకు తెలియజేశారు. ఈమేరకు పోలీసులు పోలయ్య కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి వెళ్లిన కుటుంబ సభ్యులు ఆ మృతదేహం పోలయ్యదేనని గుర్తించారు.

ప్రభుత్వం మారినా.. అడ్డుకట్ట పడలే!

(5వ పేజీ తరువాయి)

రక్షించారని పండుగ చేసుకున్నారు. అయితే ఈ ఆనందం వారికి ఎంతో కాలం నిలువలేదు. వాస్తవంగా రిజర్వ్‌ఫారెస్ట్ పరిధిలో ఎటువంటి తవ్వకాలు చేపట్టాలన్నా కేంద్ర ప్రభుత్వం అనుమతులు ఉండాలి. గాని అటువంటి అనుమతులు లేకుండానే బడిదేవరకండ వద్ద గ్రానైట్ తవ్వకాలు కొనసాగుతున్నాయి.

గిరిజనుల ఆరాధ్య దేవత...

గ్రానైట్ తవ్వకాలకు అనుమతులు ఇచ్చిన ప్రాంతంతో పాటు ములగ, సంగంవలస తదితర రిజర్వ్ ఫారెస్ట్ పరిధిలో ఉన్న కొండను బడిదేవరమ్మ దేవత నిలయంగా గిరిజనులు భావిస్తున్నారు. అందుకే ఏటా బడిదేవరమ్మ తల్లికి వారు ప్రత్యేక పూజలు చేసి.. గిరిజన సంప్రదాయాల ప్రకారం మొక్కులు చెల్లిస్తుంటారు. బడిదేవరమ్మను తమ ఆరాధ్యదైవతగా కొలుస్తారు. అయితే అటువంటి కొండపై గ్రానైట్ తవ్వకాలు చేపట్టడంపై ఆ ప్రాంతవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అటవీశాఖ తీరు ఇలా..

రిజర్వ్ ఫారెస్ట్‌లో ఇష్టారాజ్యంగా గ్రానైట్ తవ్వకాలు జరుగుతున్నా... నేటికీ అటవీ శాఖ వాటిని అడ్డుకోలేకపోవడం ప్రశ్నార్థకంగా మారింది. ఆధారాలతో సహా వాస్తవాలను కోర్టుకు తెలియజేస్తే.. గతంలో మాదిరిగా అటవీ శాఖకు తిరిగి అనుకూలంగా తీర్పు వచ్చే అవకాశం ఉంది. అయితే అటవీ శాఖ నుంచి వెళ్లిన పిటీషన్ పత్రాల్లో ఏదో లోపం ఉందని, దీంతో హైకోర్టు మెట్లు ఎక్క కుండానే తిరిగి అవి జిల్లాకు చేరుతున్నాయని తెలు స్తోంది. ఫారెస్ట్ అధికారులు పూర్తి ఆధారాలతో న్యాయస్థానంలో పిటీషన్ వేయకుండా ఉండడానికి కారణాలు ఏమిటన్నది ప్రభుత్వం తేల్చాల్సి ఉంది.

ఎమ్మెల్యేకు ఫిర్యాదు

గ్రానైట్ తవ్వకాల వల్ల తాము అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని పలువురు పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్రకు ఫిర్యాదు చేశారు. దీంతో ఇటీవల ఎమ్మెల్యే ఈ ప్రాంతాన్ని సందర్శించారు. ప్రజాభిప్రాయాలు తెలుసుకున్న తర్వాతే తవ్వకాలు చేపట్టాలని స్పష్టం చేశారు. కాగా గ్రానైట్ తవ్వకాలు ఆపే విధంగా ఎమ్మెల్యే ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

రిజర్వ్ ఫారెస్ట్‌లో ఉంది

'గ్రానైట్ తవ్వకాలు జరుగుతున్న ప్రాంతం రిజర్వ్ ఫారెస్ట్‌లో ఉంది. ప్రభుత్వ న్యాయవాది ద్వారా హైకోర్టులో పిటిషన్ వేసి నిరూపిస్తాం.' అని డీఎఫ్‌వో ప్రసూన తెలిపారు.

గుండె సంబంధిత సమస్యలకు నేడు ఉచిత వైద్య శిబిరం

(5వ పేజీ తరువాయి)

ఉచితంగా నిర్వహిస్తారన్నారు. జన్యుపరంగా పిల్లల్లో ఆరోగ్య సమస్యలు, ఎదుగుదల లోపాలు ఉండొచ్చని, వ్యాధులు సంభవిం చొచ్చని తెలిపారు. వాటిని సకాలంలో గుర్తించి తగు చికిత్స అందించాలని సూచించారు. ఈ సమావేశంలో ఆర్‌బీఎస్‌కే జిల్లా ప్రోగ్రాం అధికారి టి.జగన్మోహనరావు, పిల్లల వైద్య నిపుణులు ఎల్.భరత్‌చంద్ర పాల్గొన్నారు.

నిర్దేశిత సమయానికి టీకాలు వేయాలి

నిర్దేశించిన సమయానికి పిల్లలకు టీకాలు వేయాలని, అవి ప్రాణాంత వ్యాధుల నుంచి రక్షణ కల్పిస్తాయని డీఎంహెచ్‌వో భాస్కరరావు స్పష్టం చేశారు. వైద్యాధికారులు, ఆరోగ్య పర్యవేక్షకులకు శుక్రవారం స్థానిక ఎన్‌జీవో హోంలో వర్క్‌షాప్ నిర్వహించారు. పోలియో, హెపటైటీస్, క్షయ, కోరింతదగ్గు, న్యూమోనియా, కంఠసర్పి, తట్టు, అతిసారం, ధనుర్వాతం తదితర ప్రాణంతాక వ్యాధులకు పిల్లలు గురికాకుండా చూడాలని ఆయన సూచించారు. షెడ్యూల్ ప్రకారం టీకాలు వేయాలన్నారు. అనంతరం డబ్ల్యూహెచ్‌వో సర్వేలెన్స్ అధికారి జాన్‌జూడ్ జాషువా పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా ఇమ్యూనైజేషన్‌పై ఓరియెంటేషన్ గురించి తెలియజేశారు.

స్వామిత్వ సర్వే పకడ్బందీగా నిర్వహించాలి



మ్యాప్‌ను పరిశీలిస్తున్న డిప్యూటీ ఎంపీడీవో హరిప్రసాద్

జియ్యమ్మవలస, ఆగస్టు 22 (ఆంధ్ర జ్యోతి): కేంద్ర ప్రభు త్వం ప్రవేశ పెట్టిన స్వామిత్వ సర్వే సకాలంలో పకడ్బందీ గా చేయాలని డిప్యూటీ ఎంపీడీవో హరిప్రసాద్ తెలిపారు. చినమేరంగి పంచాయ తీలో జరుగుతున్న స్వామిత్వ సర్వే కార్యక్రమాన్ని ఆయన శుక్రవారం తనిఖీ చేశారు. ముందుగా సంబంధిత గ్రామ మ్యాప్‌ను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో మొదటి విడతగా 25 గ్రామాలు ఎంపిక చేసి ఇచ్చారన్నారు. మూడు నెలల్లో ఈ గ్రామాల్లో స్వామిత్ర సర్వే పూర్తి చేయాల్సి ఉందన్నారు. ఈ ఏడాది డిసెంబరు చివరి నాటికి మండ లంలోని అన్ని గ్రామ కంఠ భూముల్లో ఉన్న ఇళ్ల సర్వే పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్దేశించిందని తెలిపారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి డి.రవికుమార్, ఇన్‌చార్జి ఇంజనీరింగ్ అసిస్టెంట్ ఉన్నారు.

ఖాళీ బిందెలతో నిరసన



ఖాళీ బిందెలతో నిరసన చేస్తున్న మహిళలు

మక్కువ, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక కూరాకుల వీధిలో నాయీ బ్రాహ్మణ వీధి, జాలరి వీధుల్లో గత ఐదు నెలల నుంచి కొళాయిల ద్వారా తాగునీరు సరఫరా కాకపోవడంతో తాగడానికి మంచినీరు కరువైందని సంబంధిత వీధి మహిళలు, స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద శుక్రవారం ఖాళీ బిందెలతో నిరసన చేశారు. సువర్ణముఖి నదిలో నీరు తెచ్చుకుందామంటే ఇటీవల వర్షాలకు నీటి ప్రవాహం అధికంగా ఉందన్నారు. గతంలో నాయుడువీధి, కూరాకులవీధి వరకు కాలువలు నిర్మించడంతో తాగునీటి పైపులైన్లు పగిలిపోయాయని, దీంతో తాగునీరు కలుషితం అవుతుందన్నారు. ఇదే విషయం ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ పీఎంకే రెడ్డి స్పందిస్తూ మూడు రోజుల్లో సమస్య పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. అనంతరం డిప్యూటీ ఎంపీడీవో ఎస్.సూర్యనారాయణకు వినతిపత్రం అందించారు.

శ్రీశైలం ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోవాలి



నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న అటవీ శాఖ సిబ్బంది

పార్వతీపురం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): అటవీ శాఖ సిబ్బంది, అధికారుల పట్ల ఇష్టారాజ్యంగా వ్యవహరించిన.. దూషించిన శ్రీశైలం ఎమ్మెల్యేతో పాటు ఆయన అనుచరులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఉమ్మడి జిల్లా అటవీ శాఖ ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు మనోజ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక డీఎఫ్‌వో కార్యాలయం వద్ద ఆయన తమ సిబ్బందితో కలిసి నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. అటవీ శాఖ అధికారులపై దౌర్జన్యం చేయడం అన్యాయమన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు అటవీ శాఖాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మేజర్ పంచాయతీకి మార్కెట్ కరువు

- ఫుట్‌పాత్‌లు, డివైడర్లపై వ్యాపారాలు సాగిస్తున్న చిరువ్యాపారులు
- ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతున్న వైనం

భోగాపురం, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): మండలంలో మేజర్ పంచాయతీ అయిన భోగాపురం పంచాయతీకి మార్కెట్ కరువయ్యింది. భోగాపురంతో పాటు చుట్టుపక్కల పంచాయతీలకు చెందిన ప్రజలు కూడా ఇక్కడకు వచ్చి కూరగాయలు, చేపలు, మాంసం, తదితర వాటిని కొనుగోలు చేస్తుంటారు. గతంలో విశాఖ నుంచి శ్రీకాకుళం వైపు వెళ్లే సర్వీసు రహదారిని ఆనుకుని ఉన్న స్థలంలో బజారు నిర్వహించేవారు. ప్రతి బుధవారం సంత కూడా నిర్వహించేవారు. అయితే ప్రస్తుతం అక్కడ మార్కెట్ నిర్వహించడం లేదు. జాతీయ రహదారి డివైడర్లపైన, వంతెనల కింద ఫుట్‌పాత్‌లపై చిరువ్యాపారులు వ్యాపారాలు సాగిస్తున్నారు. దీంతో కొనుగోలుదారులు తమ వాహనాలను సర్వీస్ రోడ్డుపై పార్కింగ్ చేస్తున్నారు. దీంతో ఒక్కో సమయంలో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోంది.

మధ్యలోనే నిలిచిపోయిన పనులు

గతంలో స్టేట్‌బ్యాంకు సమీప వాటర్ ట్యాంకుల వద్ద రైతు బజారు ఏర్పాటుకు సన్నాహాలు చేశారు. రైతు బజారు ఏర్పాటుకు రూ.40లక్షలు, షాపింగ్ కాంప్లెక్స్‌కు రూ.40లక్షలు మంజూరు చేశారు. రెండున్నర ఏళ్ల కిందట అక్కడ రైతు బజారు నిర్మాణం ప్రారంభించారు. అప్పట్లో నిర్మాణ పనుల్లో భాగంగా రక్షిత తాగునీటి పైపులు మరమ్మతు లకు గురయ్యాయి. దీంతో నిర్మాణ పనులు నిలిచిపోయా యి. ఇప్పటికైనా అధికారులు స్పందించి రైతు బజారుకు స్థలం సమకూర్చి, మార్కెట్ అంతా ఒకేచోట నిర్వహించే లా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



హైవే వంతెన కింద ఫుట్‌పాత్‌పై వ్యాపారాలు చేస్తున్న చిరు వ్యాపారులు

భక్తిశ్రద్ధలతో శ్రావణ శుక్రవారం పూజలు

శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకుని జిల్లాలోని పలు దేవాలయాల్లో గల అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజల్లో అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. సామూహిక కుంకుమార్చనలు చేశారు.

(ఆంధ్రజ్యోతి బృందం)



పార్వతీపురంటౌన్: పార్వతీదేవి ఆలయంలో కుంకుమార్చనలు



వీరఘట్టం: దుర్గాదేవి ఆలయంలో..



బొబ్బిలి: పూజలందుకుంటున్న గొల్లపల్లి దాడితల్లి



గరుగుబిల్లి: చిలకాంలో గాయత్రీ యజ్ఞం నిర్వహిస్తున్న దృశ్యం



బొబ్బిలి రూరల్: గొర్లెసీతారాంపురం కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో..



పూజలు నిర్వహిస్తున్న మంత్రి సంధ్యారాణి



బొబ్బిలి: పూజలు నిర్వహిస్తున్న భక్తులు

పూజల్లో మంత్రి సంధ్యారాణి

సాలూరు, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): శ్రావణ శుక్రవారం సందర్భంగా మంత్రి గుమ్మిడి సంధ్యారాణి దంపతులు సాలూరు పట్టణంలోని వివిధ దేవాలయాలను సందర్శించి, ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా కామాక్షి అమ్మవారి ఆలయాన్ని దర్శించుకున్నారు. అనంతరం వేంకటేశ్వరాలయం, కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయాలను దర్శించుకున్నారు.

జీతాలు చెల్లించండి

- గ్రీన్ అంబాసిడర్ల నిరసన



కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న గ్రీన్ అంబాసిడర్లు

బెలగాం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): గ్రీన్ అంబాసిడర్ల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ నాయకుడు వై.మన్మథరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక కలెక్టర్ కార్యాలయం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో వారు నిరసన తెలిపారు. ఈసందర్భంగా మన్మథరావు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 15 మండలాల్లో వెయ్యి మంది గ్రీన్ అంబాసిడర్లుగా పని చేస్తున్నారన్నారు. వారికి 15 నెలలుగా జీతాలు ఇవ్వలేదని, వారు ఆర్థికంగా చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. గతంలో స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ద్వారా జీతాలు చెల్లించేవారని, గత ప్రభుత్వం హయాంలో వారి జీతాలు చెల్లింపులు పంచాయతీ సెక్రటరీలకు అప్పజెప్పారన్నారు. అప్పటి నుంచి గ్రీన్ అంబాసిడర్లకు వేతన బకాయిలే పెరిగాయన్నారు. వెంటనే వారికి బకాయి వేతనాలు చెల్లించాలని, వారి రక్షణకు గ్లౌజ్‌లు, బూట్లు వంటి పరికాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం జేసీ శోభికకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

పాలకొండను జిల్లా కేంద్రంగా ప్రకటించాలి



పోస్టుకార్డు ఉద్యమం చేస్తున్న దృశ్యం

పాలకొండ, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): పాలనా సౌలభ్యానికి పాలకొండ రెవెన్యూ డివిజన్‌ను జిల్లా కేంద్రంగా ప్రకటించాలని కోరుతూ జిల్లా సాధన సమితి ఆధ్వర్యంలో శుక్రవారం పోస్టుకార్డు ఉద్యమం చేపట్టారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక పాలకొండ పోస్టాఫీసు వద్ద పలువురు ముఖ్యమంత్రి పేరిట పోస్టుకార్డులు రాసి, పోస్టు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సాధన సమితి గౌరవధ్యక్షుడు కనపాక చౌదరినాయుడు, కార్యదర్శి వండాన కూర్మారావు, ట్రెజరర్ సబ్బునానాజీ, ఉద్యోగులు, విశ్రాంత ఎంప్లాయీస్ యూనియన్ ప్రెసిడెంట్ రమణమూర్తి, డాక్టర్ చిరంజీవిపాత్రో, ఆర్ఎంపీ త్రినాథరావు, కొట్నాన అప్పన్న కోటేశ్వరరావు, సంకర గురునాథరావు పాల్గొన్నారు.

హెల్త్‌కార్డులను వినియోగించుకోండి



హెల్త్‌కార్డులను అందిస్తున్న డీఎంహెచ్‌వో

పాలకొండ, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): శ్రీవిజయ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి ఫ్యామిలీ హెల్త్‌కార్డులను సద్వినియోగం చేసుకోవాలని డీఎంహెచ్‌వో ఎస్.భాస్కరరావు అన్నారు. ఆసుపత్రి యాజమాన్యం జర్నలిస్టులకు సమకూర్చిన ఫ్యామిలీ హెల్త్‌కార్డులను శుక్రవారం స్థానిక ఆసుపత్రిలో పంపిణీ చేశారు. ఆరోగ్యశ్రీ ఉమ్మడి జిల్లా మేనేజర్ దూబ రాంబాబు, ఆసుపత్రి ఎండీ పద్మావతి మాట్లాడారు. వైద్యాధికారులు అనుపమ, సాయిశంకర్, రత్నం, సిబ్బంది ధర్మ, రమేష్, రవి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

కుల ధ్రువపత్రాల పరిశీలన వేగవంతం చేయాలి

సీతానగరం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): కుల ధ్రువీకరణ పత్రాల్లో దొర్లిన తప్పులను వేగవంతంగా సరిచేయాలని తహసీల్దార్ బి.ప్రసన్న కుమార్ వీఆర్వోలను ఆదేశించారు. శుక్రవారం పెదంకలాం, లక్ష్మీపురం గ్రామాల్లో వీఆర్వోలు చేస్తున్న కుల ధ్రువీకరణ పత్రాల పరిశీలన కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. కులధ్రువపత్రాల్లో దొర్లిన తప్పులపై ప్రభుత్వం సుమోటోగా వెరిఫికేషన్ చేయాలని మార్గదర్శకాలు విడుదల చేసిందన్నారు. అక్టోబరు నెలాఖరు నాటికి కుల ధ్రువీకరణ పత్రాల వెరిఫికేషన్ పూర్తి చేసి అసలైన ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేస్తారని తెలిపారు. ఆర్ఐ ఎన్.శ్రీనివాసరావు, కృష్ణారాయపురం, లక్ష్మీపురం వీఆర్వోలు అశ్విని, ఆనందరావులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యం

- ప్రభుత్వ విప్ జగదీశ్వరి



దర్బార్‌లో వినతులు స్వీకరిస్తున్న ప్రభుత్వ విప్ జగదీశ్వరి

గుమ్మలక్ష్మీపురం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ విప్, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. శుక్రవారం గుమ్మలక్ష్మీపురంలోని క్యాంప్ కార్యాలయం ఆమె ప్రజాదర్బార్ నిర్వహించారు. నియోజకవర్గంలోని వివిధ గ్రామాల నుంచి ప్రజలు వచ్చి తమ సమస్యల పరిష్కారం కోరుతూ వినతి పత్రాలు అందించారు. సమస్యలు తెలుసుకున్న ఎమ్మెల్యే.. సంబంధిత అధికారులతో మాట్లాడి, వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

షాపుల్లో నిబంధనలు పాటించాలి

సాలూరు, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కమిషనర్ టీటీ రత్నకుమార్ ఆదేశాల మేరకు శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాలకృష్ణ శుక్రవారం సాలూరు పట్టణంలోని పారిశుధ్య పనులను పరిశీలించారు. పెద్ద మార్కెట్‌లో మాంసం, చేపల దుకాణాలను తనిఖీ చేశారు. షాపుల చుట్టుపక్కల బ్లీచింగ్ పౌడర్ చల్లాలని, నిల్వ ఉంచిన మాంసం విక్రయించొద్దని హెచ్చరించారు. అపరిశుభ్రమైన వాతావరణంలో ఉన్న షాపులను గుర్తించి వారి నుంచి 5 కేజీల మేక మాంసం, 10 కేజీల కోడి మాంసం స్వాధీనం చేసుకున్నారు. నిబంధనలు పాటించకుంటే కేసులు నమోదు చేసి, షాపులను సీజ్ చేస్తామని హెచ్చరించారు.

ఘనంగా చిరంజీవి పుట్టినరోజు వేడుకలు



అన్నదానం నిర్వహిస్తున్న దృశ్యం

పార్వతీపురంటౌన్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): చిరంజీవి పుట్టినరోజు వేడుకలను పట్టణంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పట్టణ చిరంజీవి ఫ్యాన్స్ అధ్యక్షుడు వాహెబ్, ఉపాధ్యక్షుడు అప్పన్నల ఆధ్వర్యంలో పాతబస్టాండ్ కూడలి వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. చిరంజీవి, పవన్ కల్యాణ్ ఫ్యాన్స్ ఆధ్వర్యంలో పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు.

నాగావళి నదిలో వరద తగ్గుముఖం

గరుగుబిల్లి, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): తోటపల్లి ప్రాజెక్టు పరిధిలోని నాగావళి నదికి వరద ప్రవాహం తగ్గుముఖం పడుతోంది. గత కొద్ది రోజులుగా వర్షాలు కురవడంతో నదిలోకి అధికంగా వరద చేరింది. శుక్రవారం పైప్రాంతం నుంచి 5 వేల క్యూసెక్కుల మేర వరద ప్రవాహం రాగా, దిగువ ప్రాంతాలకు స్పిల్‌వే గేట్ల నుంచి 2,100 క్యూసెక్కుల నీటిని మళ్లించారు. సాగునీటి అవసరాల నిమిత్తం ప్రధాన కాలువల నుంచి 1,320 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు. ప్రాజెక్టులో 105 మీటర్లకు గాను 103.87 మీటర్ల నిల్వ సామర్థ్యం ఉంది.

న్యూస్ బాక్స్

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

కొమరాడ, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామభద్రపురం గ్రామ సమీపంలో అంతర్ రాష్ట్ర రహదారిపై ద్విచక్ర వాహనం అదుపు తప్పి పడిన ఘటనలో అల్లువాడ గ్రామానికి చెందిన కేఎల్ భాస్కరరావుకు గాయాలయ్యాయి. భాస్కరరావు కూనేరు నుంచి స్వగ్రామం అల్లువాడకు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. క్షతగాత్రుడిని రామభద్రపురం పీహెచ్‌సీకి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం పార్వతీపురం జిల్లా ఆసుపత్రికి తరలించారు.

సారా రవాణా చేస్తున్న ఇద్దరిపై కేసు

పార్వతీపురంటౌన్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): మన్యం జిల్లాలో సారా రవాణాకు సంబంధించి ఇద్దరు వ్యక్తులపై పీడీ యాక్టు నమోదు చేసినట్టు జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ బి.శ్రీనాథుడు తెలిపారు. శుక్రవారం రాత్రి ఆయన విలేకర్లతో మాట్లాడారు. పార్వతీపురం మున్సిపాల్టీ పరిధిలో అక్రమంగా సారా రవాణా చేస్తున్న బి.వంశీకృష్ణ, ఆర్.తేజలపై పీడీ యాక్టులో భాగంగా కేసు నమోదు చేసి అరెస్టు చేశామన్నారు.

దివ్యాంగుల పింఛన్లు తొలగించవద్దు

పాలకొండ, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల పింఛన్లను తొలగించడం అన్యాయమని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. వారు శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. దివ్యాంగుల పింఛన్లు సదరం సర్టిఫికెట్ రీ వెరిఫికేషన్ పేరిట కూటమి ప్రభుత్వం లక్షమంది పింఛన్లు రద్దు చేయడం తగదన్నారు. మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు, తదితరులు పాల్గొన్నారు.

డీజీపీని కలిసిన జయకృష్ణ

పాలకొండ, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): విజయవాడలోని పోలీస్ ప్రధాన కార్యాలయంలో డీజీపీ హరీష్‌కుమార్ గుప్తాను ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా నియోజకవర్గంలోని ఉన్న పరిస్థితులను వివరించారు.

పీవోను కలిసిన గిరిజన సంఘాల నాయకులు

గుమ్మలక్ష్మీపురం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): నూతనంగా ఐటీడీఏ పీవోగా పదవీ బాధ్యతలు చేపట్టిన పార్వతీపురం సబ్ కలెక్టర్‌ను పార్వతీపురం మన్యం జిల్లా గిరిజన నాయకులు మారిక విప్లవకుమార్, ఎస్సీ ఎస్టీ మానటరింగ్ కమిటీ మెంబ మణికుమార్ శుక్రవారం కలిశారు. పలు గిరిజన సమస్యలను ఐటీడీఏ పీవో దృష్టికి తీసుకొచ్చారు.

సొంత నిధులతో పూడికతీత పనులు

మక్కువ, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): మక్కువలోని యాదవ వీధిలో కాలువల్లో పేరుకుపోయిన పూడికలను స్థానిక టీడీపీ నాయకుడు దాసరి కేశవ తన సొంత నిధులతో శుక్రవారం తొలగింపజేశారు. యాదవ వీధిలో గల మురుగు కాలువల్లో గత కొన్ని నెలలుగా పూడికలు పేరుకుపోయాయి. దీంతో ఆ వీధివాసులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ విషయాన్ని వారు కేశవ దృష్టికి తీసుకు వెళ్లగా, ఆయన స్పందించారు. తన సొంత డబ్బులతో పూడికతీత పనులు చేయించారు.

15 వరకు రేషన్ సరుకులు పంపిణీ చేయాలి

పాలకొండ, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): రేషన్ దుకాణాలను ప్రతి నెలా 15వ తేదీ వరకు తెరిచి నిత్యావసర సరుకులు అందించాలని తహసీల్దార్ రాధాకృష్ణమూర్తి డీలర్లకు సూచించారు. మండలంలోని రేషన్ డీలర్లతో తహసీల్దార్ కార్యాలయంలో శుక్ర వారం సమావేశం ఏర్పాటు చేశారు. సీఎస్ డీటీ సన్యాసిరావు మాట్లాడుతూ నిర్ణత సమ యంలోపు డీడీలు తీయాలన్నారు. సరుకుల నిల్వ వివరాలు పట్టికలో పొందుపర్చాలన్నారు.